క్లుప్తంగా

అవగాహనతో మెలిగితే అధిక పాల దిగుబడి

గరుగుబిల్లి: పాడిరైతులు పశుపోషణలో అవగాహన పెంచుకోవాలని పశువైద్యాలు సురేష్ కుమార్ అన్నారు. వేసవిలో పశుపోషణలో తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు పెట్టే పోషకాహారంపైనే పాలదిగుబడి ఆధారపడి ఉంటుందన్నారు. పచ్చగడ్డితో పాటు పోషక విలువలు కలిగిన దాణాను అందజేయాలన్నారు. పశువులు వ్యాధుల బారిన పడితే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. సొంత వైద్యం, నాటువైద్యం వల్ల కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞవికాస పరీక్ష


ప్రజ్ఞవికాస పరీక్ష పేపర్లతో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు కోలక అవినాష్, పి.రాజశేఖర్, బి.కూర్మారావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్షను ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పత్తిక ప్రసాద్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎ.గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో మంచు దుప్పటి


గుమ్మలక్ష్మీపురం పరిసరాల్లో కురుస్తున్న మంచు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురం గ్రామ పరిసరాల్లో ఆదివారం మంచు దుప్పటి పరచుకుంది. ఉదయం 8 గంటలు దాటినా మంచు తెరలు తొలగకపోవడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న మంచు ప్రభావంతో మామిడి, జీడి తోటల్లో పూత, పిందె రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉందని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.

సమన్వయంతో జాతర చేసుకుందాం


జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న గ్రామ పెద్దలు

గుమ్మలక్ష్మీపురం: గ్రామస్తులంతా సమన్వయంతో ఉత్సవాన్ని నిర్వహించుకుందామని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర రావు పిలుపునిచ్చారు. గ్రామంలోని ఉమాసహిత కైలాసనాథస్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహణపై చర్చించేందుకు ఆదివారం గ్రామ పెద్దలంతా సమావేశమయ్యారు. మార్చి 17 నుంచి ఐదు రోజుల పాటు జాతర నిర్వహించాలని నిర్ణయించారు. జాతర సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త వెంకటరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, కమిటీ సభ్యులు విష్ణు, మద్ది దొరబాబు, జె.వెంకటరావు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణం


కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి–గోపాలపురం గ్రామాలను కలుపుతూ చేపట్టిన కంకర రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధు లు రూ.2 లక్షలతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ రహదారి కారణంగా రెండు గ్రామాల రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. పూర్తిస్థాయిలో రహదారిని అభివృద్ధి చేసి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించేలా యంత్రాంగం చొరవ చూపాలని ఆయా గ్రామా ప్రజలు కోరుతున్నారు.

1నుంచి పశువులకు టీకాలు

పార్వతీపురం: వేసవిలో పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మార్చి 1నుంచి జిల్లా వ్యాప్తంగా టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖాధికారి ఎ.ఈశ్వరరావు తెలిపారు. ప్రతి మండలంలో పశువైద్య కేంద్రాల పరిధిలో శిబిరాలను నిర్వహించి టీకాలు వేయనున్నట్లు చెప్పారు. గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

వేసవి దుక్కులతో ఉపయోగం


మెట్టుపాలంలో వేసవి దుక్కి చేస్తున్న రైతు

గరుగుబిల్లి:

పంటకోతల తరువాత మళ్లీ వర్షాలు కురిసేంతవరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే నేల నిర్జీవంగా తయారవుతుందని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తెలిపారు. పంట కోతలు పూర్తయ్యాక చీడపీడలకు కారణమైన శిలీంద్రాలు నేల పొరల్లో నివాసం ఏర్పర్చుకుంటాయి. వేసవిలో దుక్కి చేయడం వల్ల అవి పైకి వచ్చి ఎండకు నశిస్తాయన్నారు. వేసవి దుక్కుల ఆవశ్యకతను ఆమె వివరించారు.

ప్రయోజనాలు

వివిధ పంటలను ఆశించే వేరు పురుగులు, శిలింద్రాలు పంటలేని సమయంలో నేలల్లో కోశస్థ దశలోకి వెళ్లి సుప్తావస్థలో ఉంటాయి. తొలకరి వర్షాలకు కోశస్థదశ నుంచి పూపాలు బయటకు వస్తాయి. వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల నేలలో ఉన్న కోశాలు, గుడ్లు బయటపడి ఎండ వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు మొదలైన పక్షులు వాటిని తినేయడం ద్వారా తర్వాత వేసుకున్న పంటను చీడపీడలు ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది. రబీ పంటకోసిన తరువాత తగినంత తేమవున్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవిదుక్కులు చేయాలి. వీలున్నప్పుడు వేసవిలో సాధారణంగా కురిసే వర్షాల తేమతో వరి మాగాణులును, మెట్ట భూములను, బీడు భూములను దున్నుకోవాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడం వలన తొలకరి వర్షాలు పడగానే భూమిలోకి నీరు ఇంకుతుంది. మాములు కన్నా వర్షాలు తక్కువ పడిన సందర్భాలలో వేసవి దుక్కుల వల్ల ఉపయోగం వుంటుంది.

దుక్కులు చేయకపోతే..

వేసవి దుక్కులు చేపట్టకపోవడం వల్ల ఖరీఫ్ పంటసాగుకు నేలను చదును చేయడం ఆలస్యమువుతుంది. కలుపుమొక్కలు విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉంది. పంటకు వేసే ఎరువులు కలుపు మొక్కలు గ్రహించడంతో పంట పెరుగుదల తగ్గిపోతుంది. భూమి లోపలి పొరల నుంచి తేమను తీసుకుని ఆవిరిరూపంలో బయటకు పంపేస్తాయి. దీనివల్ల పంటకు నీరు, పోషకాల కొరత ఏర్పడుతుంది. అధిక మోతాదులో ఎరువులు వేయాల్సివస్తుంది. సాగు ఖర్చు పెరుగుతుంది. దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

కలుపునివారణ

కలుపు మొక్కలు ప్రత్యక్షంగా పంటకు నష్టం కలిగించడంతోపాటు పరోక్షంగా చీడపీడలకు ఆశ్రయమిచ్చి పంటనష్టానికి కారణమవుతాయి. వేసవిదుక్కులు చేయడం వల్ల బహువార్షిక కలుపు జాతి మొక్కలైన తుంగ, గరిక, రెల్ల, దర్భ వంటి వాటిని తొలగించవచ్చు. మెట్టభూములలో, పండ్ల తోటల్లో కనిపించే గరిక గడ్డి నేలమీద పాకుతూ శాఖోపశాఖలుగా విస్తరిస్తుంది. వాటిని తెంపేసినా కణుపుల నుంచి మళ్లీ వేళ్లు తొడిగి తొందరగా వ్యాప్తిచెందుతాయి. వేసవి దుక్కుల వల్ల భూమి పొరల్లో ఉన్న కలుపు విత్తనాలు బయటపడి ఎండ తీవ్రతకు మొలకెత్తే సామర్థ్యాన్ని కోల్పోతాయి. – **ఆర్.విజయభారతి, మండల వ్యవసాయాధికారి**

జంగం సంక్షేమ సేవా సంఘం ఎన్నిక ఏకగ్రీవం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా చంద్రమౌళీశ్వరస్వామి జంగం సంక్షేమ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భామినికి చెందిన అర్చకుడు మీగడ సంతోష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఐక్య జంగమ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవళ్ల ఆనంద్‌కుమార్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు చెన్నాపురం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పంచాక్షరి గుంపస్వామి, ప్రధాన కార్యదర్శిగా మీగడ సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దివదారి సింహాచలం, కోశాధికారిగా కొండేటి శంకరరావుతో పాటు 14 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్సై షణ్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ గ్రామంలో స్థానిక యువత ఆధ్వర్యంలో నిర్వహించిన మోగా క్రికెట్ టోర్నీని ఎల్విన్‌పేట ఎస్సై షణ్ముఖరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని సూచించారు. ఈ పోటీల్లో 45 జట్లు పాల్గొన్నట్లు పీడీ పత్తిక చంద్రమోహన్ తెలిపారు. విజేతలకు రూ.22వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.11 వేలు బహుమతిగా అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణరావు, గ్రామ యువత పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రాక్టికల్ పరీక్షలు

పాలకొండ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలతో పాటు, తమ్మినాయుడు, శ్రీసత్యసాయి కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ సబ్జెక్టులకు సంబంధించి ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యహ్నం 2 నుంచి 5 వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. ఒక్కో బ్యాచ్‌కు 20 మంది విద్యార్థులు చొప్పున మొత్తం 160 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా మాచర్ల కుమారస్వామి, పైల శంకరరావు, సత్యప్రభ వ్యవహరించారు.

- వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఆదివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు 85 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ పైల శంకరరావు తెలిపారు. అలాగే స్థానిక గాయత్రీ కళాశాలలో జరిగిన ప్రాక్టికల్స్‌కు 67 మంది విద్యార్థులు హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ రెండు కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు.

జీడి రైతుల్లో ఆందోళన


గరుగుబిల్లి సమీపంలో జీడిపంట

గరుగుబిల్లి: జీడిమామిడి రైతులకు ఈ ఏడాది ఆశించిన దిగుబడులు చేతికందే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల విస్తరంగా కురుస్తున్న పొగమంచు కారణంగా పూత, పిందెలు రాలిపోతుండడం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. నిలిచిన కాస్త పూతను, పిందెలను కాపాడుకునేందుకు ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. మండలంలోని రావుపల్లి, కొత్తూరు, కొత్తపల్లి, ఉద్దవోలు, గరుగుబిల్లి, శివ్వాం, పెద్దూరు, దళాయివలస, లఖనాపురం, రావివలస తదితర గ్రామాల్లో సుమారు 1500 ఎకరాలలో జీడి తోటలున్నాయి.

నర్తును గెలిపించుకుందాం..


పాలవలస రాజశేఖరం, విక్రాంత్‌లను ఆహ్వానిస్తున్న నర్తు రామారావు, తదితరులు

- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పాలవలస పిలుపు

పాలకొండ: శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును గెలిపిద్దామని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు పాలవలస రాజశేఖరం పిలుపునిచ్చారు. ఆదివారం తనను కలిసేందుకు పాలకొండ వచ్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావుకు శుభాభినందనలు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సమావేశానికి హాజరుకావాలని రాజశేఖరంను, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజశేఖరం మాట్లాడుతూ..ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు నీచరాజకీయాలకు పాల్పడుతూ రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. అంపశయ్యపై ఉన్న టీడీపీకి రాజ్యాధికారం కట్టబెట్టేందుకు ఈనా డు సంస్థల అధినేత రామోజీరావు ప్రభుత్వంపై అనేక తప్పుడు కథనాలు ప్రచురిస్తూ పత్రికా విలువలను దిగజారుస్తున్నారన్నారు. టీడీపీకి ఎల్లో మీడి యా సపోర్టు తప్ప రాష్ట్ర ప్రజల సహకారం లేదన్నా రు. 2024లో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, జగన్‌మోహన్ రెడ్డే రాష్ట్రాన్ని పరిపాలిస్తారన్నారు. నర్తుతో పాటు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఉన్నారు.

ఎస్సీలంటే అలుసా?

పార్వతీపురం: జనసేన నాయకుడు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు వి.దాలినాయుడికి ఎస్సీలంటే అంత అలుసా అని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఎస్సీలంటే జనసేన నాయుకుడి విషయంలో అణగారిన వర్గాల కిందకు వస్తారా? అని ప్రశ్నించారు. జనసేన నాయకుడికి పబ్లిసిటీ పిచ్చిపట్టిందన్నారు. ఎస్సీల మనోభావాలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయుకుడిపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఎస్సీలకు జనసేన నాయకుడు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వెనకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు కళింగవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళింగవైశ్యుల సమస్యలను పరిష్కరించేందుకు తప్పకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఎప్పుడూ ఉంటానని, ఎవరికైనా సమస్య ఉంటే తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళింగ వైశ్యసంఘం అధ్యక్షుడు గుడ్ల ప్రసాద్, అందవరపు కోటేశ్వరరావు, కొత్తకోట ప్రసాద్, గుడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బలిజిపేట: మండంలోని పలగరలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే జోగారావు ఆదివారం పరిశీలించారు. పలగరలో సుమారు రూ.14లక్షలతో శ్మశానం నుంచి అమ్మవారి గుడివరకు 380మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణాన్ని, బీసీ కాలనీలో నిర్మాణాలు పూర్తయిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కాలనీలోని మూడు రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జాన్, ఎస్.భాస్కరరావు, టి.ప్రసాద్, కె.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల జోలికి పోవద్దు


స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై హరికృష్ణ

వీరఘట్టం: మండలంలోని కిమ్మి–నడుకూరు గ్రామాల మధ్య పంటపొలాల్లో తిష్ట వేసిన ఏనుగులను తరిమేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొద్ది రోజుల కిందట చెరుకు తోటలో ఉన్న ఏనుగులను తరమేందుకు ఓ వ్యక్తి పంటకు నిప్పు పెట్టాడు. ఈ వ్యవహారం అటు పోలీసులకు, ఫారెస్టు అధికారులకు తలనొప్పిగా మారింది. ఇదిలా ఉండగా ఆదివారం మరికొందరు వ్యక్తులు ఏనుగులను తరిమికొట్టేందుకు తారాజువ్వలను విడిచిపెట్టారు. దీంతో ఏనుగులు భయంతో పరుగులు తీసి, సమీపంలో ఉన్న పంటలను ధ్వంసం చేశాయి. తారాజువ్వలు వదలడంతో వాటి నిప్పురవ్వలు అంటుకుని కిమ్మి సమీపంలోని ఓ రైతుకు చెందిన ఐదు ఎకరాల చెరుకుతోట దగ్ధమైంది. విషయం తెలియడంతో ఎస్సై ఎం.హరికృష్ణ కిమ్మి గ్రామానికి చేరుకుని పలువురిని హెచ్చరించారు. ఏనుగులను కవ్వించొద్దని కోరారు. ఏదైనా జరగరానిది జరిగితే అందరం ఇబ్బందులు పడాల్సి వస్తుందని సూచించారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం


మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

సీతంపేట: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక ఏపీఆర్ గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఆదివారం జరిగిన ఫేర్‌వెల్ డే ఫంక్షన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈ దశలో తీసుకున్న నిర్ణయాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే రహదారి భద్రత, మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలు, దిశ చట్టం, దిశ యాప్ వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. మహిళా పోలీసులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సారా నిర్మూలనకు కృషిచేయాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లతో సమావేశమై ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ మురళీధర్, ఎస్సై నీలకంఠరావు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి సరిహద్దు మాత ఉత్సవాలు


సంతోషిమాత మూలవిరాట్

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో వెలసిన బత్తిలి సంతోషీశ్వర, ఆంజనేయ, నవగ్రహ సహిత మాత ఆలయంలో పంచరాత్రుల ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. తెలుగు–ఉత్కళ సమ్మేనంగా ఈ నెల 28 నుంచి మార్చి 4 వరకు సరిహద్దు మాత 37వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. వేదపండితులచే నిత్య హోమాదికాలు, గోత్రనామాలతో అభిషేకాలు, నిత్యపూజలు నిర్వహిస్తారు. మంగళవారం నాడు సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని గ్రామ తిరువీధుల్లో ఊరేగించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశాలోని రాయగడ, గజపతి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాటు చేశారు.

ఆత్మీయ సమ్మేళనం

వీరఘట్టం: అరె నువ్వేనా..ఎంత లావుగా ఉండేవాడివి.. పీలగా అయిపోయావేరా.. చిన్నప్పుడు తెగవాగేవాడివి.. ఇప్పుడు మౌనంగా ఉన్నావేం. ఎంత మారిపోయావురా..గుర్తు పట్టలేకయాను.. అంటూ ఒకరు. నువ్వేం చేస్తున్నావు.. భార్యాపిల్లలు ఎలా ఉన్నారు..అంటూ మరొకరు. ఇలా కుశల ప్రశ్నలు, ఆత్మీయ పలకరింపులతో వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందడి నెలకొంది. పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. 1982–83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గుడివాడ రాములు, మాచర్ల శ్రీరాములుదొర, భోగి సత్యానందం, సీరపాణి మాస్టార్లతో పాటు హెచ్ఎం సుధీర్‌ను ఘనంగా సత్కరించారు.


వీరఘట్టం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సృష్టికి మూలం స్త్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్టీ గంగాభవాని

భామిని: మండలంలోని గురండి విద్యావికాస్ హైస్కూల్‌లో శ్రీగురు విశ్వస్ఫూర్తి ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో స్త్రీశక్తి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ, స్కూల్ చైర్మన్ మాసాపు మిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు సృష్టిలో స్త్రీ పాత్రను వివరించారు. స్త్రీ లేనిదే మానవ సృష్టి లేదని, ఆధునిక ప్రపంచంలోనూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. భామిని కేజీబీవీ ఎస్ఓ భూరాడ శారద, సింగిడి వ్యాపారవేత్త గుడ్ల సత్యారావు, ప్రిన్సిపాల్ ఎం.గాంధీరాజు, సంస్థ సమన్వయకర్త, విద్యావేత్త వలరౌతు షణ్ముఖరావు, స్ఫూర్తి ట్రస్టీలు ఎం.గంగాభవాని, ప్రమీల, సౌజన్య, మేనేజింగ్ ట్రస్టీ వి.సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శిర్లిపోతన్న, ఎల్లమ్మ జాతర


భక్తులచే పూజలందుకుంటున్న శిర్లిపోతన్న, ఎల్లమ్మలు

పాలకొండ: నగర పంచాయతీలో శిర్లిపోతన్న, ఎల్లమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. శిర్లిపోతన్న వీధిలో వెలసిన దేవతామూర్తులకు భక్తులు పూజలు చేశారు. కొత్తగా నిర్మించిన ఆలయ శిఖరాన్ని పునఃప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సోమవారం కూడా యాత్ర సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

28న శిర్లిఎల్లమ్మ జాతర

కురుపాం: ఈ నెల 28న శిర్లి ఎల్లమ్మ తల్లి జాతర ప్రారంభం కానుంది. మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న శిర్లి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం 5 గంటల నుంచి కురుపాం నెయ్యిలవీధిలో ఉన్న గర్భగుడిలో ఎల్లమ్మతల్లిని భక్తులు దర్శించుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు శిర్లి ఎల్లమ్మ మత్స్య పారిశ్రామిక సంఘ సభ్యులు ఏర్పాటు చేశారు.

నారాయణపురంలో పైపులైన్ మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు. 'వీధి కుళాయిల నుంచి కలుషిత నీరు' శీర్షికన సాక్షి దినపత్రికలో ఆదివారం వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. దీనిపై ప్రధాన పైప్‌లైన్‌లో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయనే పరిశీలన నిమిత్తం పైప్‌లైను తవ్వించి మరమ్మతులు చేపట్టారు. సువర్ణముఖి నదినుంచి ఓహెచ్ఎస్ఆర్‌కు వెళ్లే పైప్‌లైన్‌లో చెత్తాచెదారాలు చేరి ఉండడంతో కలుషిత నీరు వస్తున్నట్టు గుర్తించిన అధికారులు వాటి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.